క్లుప్తంగా

ఢిల్లీ నుంచి వచ్చి.. తొలి ఓటు వేసి



తండ్రి వెంకటేష్‌తో కలిసి ఓటు వేసిన అభిలోకేష్

హుజూర్‌నగర్ : ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓ విద్యార్థి ఢిల్లీ నుంచి వచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. హుజూర్‌నగర్‌కు చెందిన నిమ్మల శాంతకుమారి, వెంకటేశ్‌ల కుమారుడు నిమ్మల అభిలోకేష్ న్యూఢిల్లీలో ఐఐటీ (సీఎస్) నాల్గవ ఏడాది చదువుతున్నాడు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి సోమవారం న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు విమానంలో వచ్చాడు. అక్కడ నుంచి బస్సులో స్వగ్రామమైన హుజూర్‌నగర్‌కు చేరుకొని తన తొలి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తొలి ఓటును తండ్రితో కలిసి వినియోగించుకోవడం ఆనందంగా ఉందని అన్నాడు.

గుజరాత్‌లో చదువుతూ..



హుజూర్‌నగర్‌లో ఓటు వేసిన ధన్వంత్‌కుమార్

హుజూర్‌నగర్ : లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓ విద్యార్థి గుజరాత్ నుంచి వచ్చాడు. హుజూర్‌నగర్‌కు చెందిన కోట కృష్ణవేణి, శ్రావణ్‌కుమార్‌ల కుమారుడు ధన్వంత్‌కుమార్ గుజరాత్‌లోని వడోదర పారుల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రైలు ప్రయాణం చేసి వచ్చి ఓటు వేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తన ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు.

గుండ్లపల్లిలో ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి

మఠంపల్లి : లోక్‌సభ ఎన్నికల్లో మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తన తల్లి మాజీ సర్పంచ్ శానంపూడి సత్యావతితో కలిసి సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కేంద్రీయ విద్యాలయంలో వందశాతం ఉత్తీర్ణత

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం పదోతరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 36మంది విద్యార్థులకు 36మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఐదేళ్లుగా పాఠశాలలో వంద శాతం ఫలితాలను సాధించి రికార్డును సృష్టిస్తున్నారు. ఈ సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన సుహాన్ సమీర్ జాడ్‌దోకు 486/500ల మార్కులతో ప్రథమ స్థానం, పూర్ణ సుమితకు 469/500 మార్కులతో ద్వితీయ స్థానం, పి. సుమిధకు 440/500 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

నాలుగు లక్షల మెజార్టీతో గెలుస్తాం : దామోదర్‌రెడ్డి

సూర్యాపేట : నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీరారెడ్డి 4 లక్షల మెజార్టీతో గెలవబోతున్నారని మాజీమంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బేబీ మూన్ స్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకుని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు విశ్వాసం ఉంచారని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని మద్దతు తెలుపుతున్నారన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలోనూ సంపూర్ణ మెజార్టీ వస్తుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రూ.100 కోట్ల డబ్బులు పంపిణీ చేసి స్వల్ప మెజార్టీతో గెలిచిన జగదీష్ రెడ్డి ఈ ఎన్నికల అనంతరం నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతుందని తెలిపారు.

సూర్యక్షేత్రంలో భజనలు



భజనలు చేస్తున్న మహిళలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో సోమవారం భజనల కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణస్వామి క్షేత్ర విశిష్టత, భక్తి గీతాలను పాడారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్



హుజూర్‌నగర్‌లో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళా ఓటర్లు



మునగాల : బరాఖత్‌గూడెంలోని 81వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో బారులుదీరిన ఓటర్లు



మునగాల : మాధవరంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



గరిడేపల్లిలో ఆదర్శ పోలింగ్ కేంద్రం ఎదుట అధికారులు



అనంతగిరి : త్రిపురవరంలో ఓటు వేసేందుకు బారులుదీరిన గ్రామస్తులు

కోదాడ : కోదాడ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, హడావుడి లేకుండా ఏకపక్షంగా పోలింగ్ సాగింది. బూత్‌ల సమీపంలో తమ అభ్యర్థికి ఓటు వేయాలని అడగేవారే లేకుండాపోయారు. ఒకటి రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడం మినహా ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ ముగిసింది. పట్టణ పరిధిలోని నయానగర్ పోలింగ్ బూత్‌లో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో ఓటింగ్ శాతం తక్కువ ఉందని, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కాగా, కాంగ్రెస్ నాయకులు మాత్రమే బూత్‌లను సందర్శించి ఓటింగ్ తీరును పరిశీలించారు. ఇతర పార్టీల నేతలు బూత్‌లవైపు కన్నెత్తి చూడకపోవడం గమనించదగ్గ విషయం. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు కోదాడలోని శ్రీనగర్‌కాలనీలో, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నడిగూడెం మండలం కరివిరాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, నియోజకవర్గ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు 13.70 శాతం, 9 నుంచి 11 గంటల వరకు 33.70 శాతం, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 52.33 శాతం, 1 గంట నుంచి 3 గంటల వరకు 63.79 శాతం, 3 గంటల నుంచి 5 గంటల వరకు 72.40 శాతం పోలింగ్ నమోదైంది. 5 నుంచి 6 గంటల మధ్య జరిగిన పోలింగ్ కలుపుకొని మొత్తం 75. 15 శాతం పోలింగ్ నమోదైంది.

ప్రశాంత వాతావరణంలో..

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం వేళ వాతావరణం చల్లగా ఉండటంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. మధ్యాహ్నానికి కొంత పలుచబడి సాయంత్రం మళ్లీ ఊపందుకుంది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా పోలింగ్ స్టేషన్‌లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఓటర్లు విశ్రాంతి తీసుకునేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అక్కడ స్వీటు పాకెట్లు, మజ్జిగ, మంచినీరు, మందులు అందుబాటులో ఉంచి వాటిని ఓటర్లకు పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు వారి బంధువులు, స్వచ్ఛంద కార్యకర్తలు, పోలీసులు సహాయం అందించారు. పోలింగ్ సరళిని ఆయా పార్టీల నాయకులు పరిశీలించారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఏర్పాట్లు, కేంద్రాలను నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ శ్రీనివాస్‌లు, అదనపు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ నాగార్జున రెడ్డి పరిశీలించారు. పోలిగ్ కేంద్రాల వద్ద పోలీసు భద్రతను సీఐ చరమందరాజు పర్యవేక్షించారు.

నియోజకవర్గంలో 1,91,843 ఓట్లు నమోదు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 76.30 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,51,444 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,21, 956 మంది ఉండగా మహిళలు 1,29,471 మంది కాగా ట్రాన్స్‌జెండర్లు 17 మంది ఉన్నారు. నియోజకవర్గంలో 1,91,843 ఓట్లు పోల్ కాగా దాదాపు 76.30 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వజినేపల్లిలో ఈవీఎం మొరాయింపు

చింతలపాలెం మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో మొత్తం 36,530 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 12,992 మంది, మహిళలు 13,538 మంది ఉన్నారు. వారిలో మొత్తం 21,021 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 79.23 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా, ఉదయం వజినేపల్లిలో ఈవీఎం మొరాయించింది. దీంతో సాంకేతిక సిబ్బంది వెంటనే సరిచేయడంతో తిరిగి పనిచేసింది. చింతలపాలెం, నక్కగూడెం గ్రామాలలో వీవీ ప్యాట్‌లలో ఎర్రర్ రావడంతో సాంకేతిక సిబ్బంది వాటిని మార్చి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.

బీఎల్‌ఓపై ఆగ్రహం

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. గోపాలపురం, బూరుగడ్డ, వేపలసింగారం, అమరవరం తదితర గ్రామాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలైన్‌లో బారులుదీరారు. కాగా, మండల పరిషత్ కార్యాలయంలోని 211, 212 బూత్‌లలో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వో ఉష పోల్ చిట్టీ ఇవ్వలేదంటూ ఓ ఓటర్ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలింగ్ అధికారులు వచ్చి పోల్ చిట్టీ ఇవ్వడంతో వివాదం సద్దుమనిగింది.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

చిలుకూరు : మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చిలుకూరు మండలంలో 77.78 శాతం పోలింగ్ నమోదైంది. 38 పోలింగ్ బూత్‌లలో 32,427 ఓట్లకు గాను 25, 225 ఓట్లు పోల్ అయ్యాయి. చెన్నారిగూడెంలో పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలో సాంకేతిక లోపంతో సుమారుగా 15 నిమిషాలకు పైగా పోలింగ్ నిలిచి, ఆ తరువాత యాథావిధిగా జరిగింది. బేతవోలులో పోలింగ్ కేందాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరిశీలించారు. చెన్నారిగూడెంలో ఎంపీపీ, ఆచార్యులగూడెంలో జెడ్పీటీసీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పోలింగ్ వేగంగా సాగగా ఆ తరువాత మందకొడిగా జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాంబాబు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబులు, సెక్టోరియల్ అధికారులు పరిశీలించారు.

ఈవీఎం మొరాయింపుతో ఓటర్ల అసహనం

మునగాల : మండల వ్యాప్తంగా 44 పోలింగ్ బూత్‌లలో సోమవారం పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 77.79 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికార యంత్రాంగం తెలిపింది. కాగా మండల కేంద్రంలోని 74వ బూత్‌లో మాక్ పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎం అర్ధగంట సేపు మొరాయించింది. అదేవిధంగా బరాఖత్‌గూడెంలోని 81వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో క్యూలైన్ పెరిగి ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. మాధవరంలోని మోడల్ పోలింగ్ స్టేషన్‌ను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గల పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



నడిగూడెం : తన స్వగ్రామం కరివిరాలలో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

పోలింగ్ సరళి తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం : మండలంలోని 29 పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలను మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ హేమామాలిని, స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 80 శాతం ఓట్లు పోల్ అయినట్లు తహసీల్దార్ తెలిపారు. నడిగూడెం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి పరిశీలించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

ఓటు వేసిన 16819 మంది ఓటర్లు

పాలకవీడు : మండల వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 21144 మంది ఓటర్లకు గాను 16819 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అనంతగిరి : మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల్లో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 12 గంటల వరకు 50 శాతం పోలింగ్ నమోదు కాగా సాయంత్రానికి 80.22 శాతం ఓట్లు పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు ఖానాపురం, శాంతినగర్, లకారం, గోండ్రియాలలోని పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ నాయకుడు మల్లెబోయిన అంజియాదవ్‌లు అనంతగిరి, అమీనాబాద్, మొగలాయికోట, కిష్టాపురం, పాలారం, కొత్తగోల్‌తండా, ఖానాపురంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. లకారం గ్రామంలో కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మండల పరిషత్ అధికారి తుమ్మల నాగేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ నవీన్‌కుమార్, విద్యుత్ ఏఈ కీర్తిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

కల్లూరులో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం

నేరేడుచర్ల : మున్సిపాలిటీతో పాటు మండలంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నేరేడుచర్ల మండలంలో 70.25 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో మొత్త 35 వేల 818 మంది ఓటర్లు ఉండగా వీరిలో 25 వేల 162 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కల్లూరులో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ 8:30 గంటలకు ఆలస్యంగా ప్రారంభమైంది. మున్సిపాలిటీలో పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా ఏర్పాటు చేశారు. పత్తేపురం గ్రామంలో పోలింగ్ కేంద్రంలో ఈవీఎం వద్ద చీకటిగా ఉండటంతో ఓటర్లు ఓటు వేసేందుకు కొంత ఇబ్బంది పడ్డారు. దీంతో అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించారు. తహసీల్దార్ సైదులు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయగా నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



అనంతగిరి : లకారంలో ఓటు వేసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి పుల్లారెడ్డి

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు

గరిడేపల్లి : మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో గల 57 పోలింగ్ బూత్‌లలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో 77.85 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారి బండ కవిత, ఎంపీడీఓ కన్మంతరెడ్డి వనజలు తెలిపారు. మండల వ్యాప్తంగా 35923 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సైదులు నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

28,341 ఓట్లు నమోదు

మోతె : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రావిపహాడ్‌లో ప్రారంభంలోనే ఈవీఎంలు సుమారుగా 20 నిమిషాలు మొరాయించాయి. మండలంలో మొత్తం 37,413 ఓటర్లు ఉండగా 28,341 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధి కారులు తెలిపారు. 76 శాతం పోల్ అయినట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్నం నుంచి మందకొడిగా..

మేళ్లచెరువు : మండలంలో సోమవారం పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఎండ లేకపోవడంతో 11 గంటల వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. మధ్యాహ్నం నుంచి మందకొడిగా పోలింగ్ జరిగింది. మండలంలో 33,878 మంది ఓటర్లకు గాను 25,228 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.47 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మంగళితండాలో ఈవీఎం మొరాయింపు

కోదాడరూరల్ : మండలంలోని 16 గ్రామాల్లో ఒకటి, రెండు గ్రామాల్లో స్వల్ప వాగ్వాదాలు మినహా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మంగళితండాలో ఈవీఎం ఐదు నిమిషాలు మొరాయించడంతో టెక్నిషియన్ వచ్చి రిపేర్ చేశాడు. కాగా, మండలంలో ఓటింగ్ మందకొడిగా సాగింది. దూరప్రాంతాల్లో ఉన్న అనేక మంది ఓటర్లు ఓటు వేసేందుకు రాలేదు. వేసవికాలం కావడంతో ఉదయం 11 గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపారు.



పాలకవీడులో..



నేరేడుచర్ల : మేడారంలోని పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన మహిళా ఓటర్లు



మేళ్లచెరువులో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



మునగాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి



కోదాడలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు



హుజూర్‌నగర్‌లో ఓటు వేసి సిరా గుర్తు చూపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి, ఎంపీపీ, కౌన్సిలర్లు



హుజూర్‌నగర్‌లోని మహిళా పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధురాలికి సహకరిస్తున్న మహిళా ఏఎస్ఐ



హుజూర్‌నగర్‌లో పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్న ఓటర్లు



చిలుకూరులో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు



మునగాలలో 95 ఏళ్ల వృద్ధుడిని ఓటు వేసేందుకు తీసుకువస్తున్న కుమారుడు



గరిడేపల్లి : ఓటు వేసిన ఎంపీపీ సుజాతాశ్రీనివాస్‌గౌడ్



చిలుకూరు : ఓటు వేసిన జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష



హుజూర్‌నగర్‌రూరల్ : పోల్ చిట్టీ ఇవ్వలేదని బీఎల్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఓటరు



కోదాడరూరల్ : కాపుగల్లులో వికలాంగులు, వృద్ధులను తీసుకెళ్తున్న సిబ్బంది

కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు ఖాయం



మోతెలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సిరా గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మోతె : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే నలమాద పద్మావతి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మోతె మండల కేంద్రంతో పాటు మామిళ్లగూడెం, హుస్సేన్‌బాద్, రాఘవాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించబోతోందని తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ ముప్పాని ఆశా శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ పుల్లారావు, పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గోదల వీరమ్మ అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉండటంతో గ్రామానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానంద చారి స్పందించారు. వైద్య ఖర్చులకోసం వీరమ్మకు సోమవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పేర్ల నగేష్ పాడి గేదె సోమవారం వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు పేర్కొంటున్నాడు.

నిరుపయోగంగా నీటితొట్లు

- నిర్వహణ మరిచిన గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు
- నీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



అల్లెగూడెంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

చిలుకూరు : వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు మండలంలో నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఎండాకాలంలో పశువులు నీటి కోసం అల్లాడుతున్నాయి. ప్రతి గ్రామంలో ఒకటి, రెండు నీటితొట్లను గతంలో ప్రభుత్వం నిర్మించింది. కొన్ని గ్రామాల్లో రూ.50 వేలు, మరి కొన్ని గ్రామాల్లో లక్ష రూపాయల నిధులతో నీటి తొట్లు నిర్మించారు. అయితే గ్రామ పంచాయతీలు వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో సుమారు 20 నీటి తొట్లు ఉన్నాయి. వాటిలో కొన్ని నీటి తొట్లు దెబ్బతినగా మరి కొన్ని చెత్తాచెదారంతో నిండిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు వేడుకుంటున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

మండలంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్లను ఉపయోగంలోకి తీసుకొస్తాం. వాటికి గ్రామ పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయిస్తాం. నీటి తొట్టిలో నిత్యం నీరు ఉండేలా చూసి పశువుల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తాం. అవసరమైతే గ్రామ శివారులో కూడా మరి కొన్ని నీటి తొట్లు ఏర్పాటు చేస్తాం.

– గిరిబాబు, ఎంపీడీవో, చిలుకూరు